ఎమ్మెల్యేలు గట్టిగా ఆరోపిస్తున్నారు. రెండు వేల పద్నాలుగు నుండి ఇరవై మూడు మధ్య కాలంలో ఈ మూడు ప్రాంతాలకు వెళ్లిన నిధుల లెక్కలను సీఎం బయటపెట్టనున్నారు. ఏ ప్రాంతానికి ఎంత కేటాయించారనే విషయాలపై పూర్తి గణాంకాలతో సీఎం ప్రసంగం సాగనుంది. ఇతర నియోజకవర్గాల ప్రజలకు జరిగిన అన్యాయాన్ని బహిరంగంగా చర్చకు పెట్టనున్నారు. ఈ గణాంకాలు చూశాక బీ ఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడతారని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో కేటీఆర్‌ను సిరిసిల్లలో ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. అక్కడ ఆయన రాజకీయ భవిష్యత్తుకు శాశ్వత మంగళం పాడాలని రేవంత్ రెడ్డి పట్టుదలగా ఉన్నారు. బతుకమ్మ చీరల తయారీలో జరిగిన భారీ గోల్‌మాల్ అంశాన్ని సభలో ప్రముఖంగా ప్రస్తావిస్తారు. నేరెళ్ల ఇసుక మాఫియా ఆగడాలు, బాధితుల వేదనను మరోసారి ప్రజల ముందుకు తీసుకురానున్నారు. దళితులను లారీలతో తొక్కి చంపించారనే తీవ్రమైన ఆరోపణలను కూడా ఈ వేదికపై గుర్తు చేయనున్నారు. ఇరవై రెండు ఏ భూముల రగడలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీలో బీఆర్ఎస్‌ను ఉక్కిరిబిక్కిరి చేశారు. అదే జోరును కొనసాగిస్తూ సిరిసిల్ల సభ ద్వారా కేటీఆర్ ఇమేజ్‌ను పూర్తిగా డ్యామేజ్ చేయాలని వ్యూహం పన్నారు. భవిష్యత్తులో ప్రధాన ప్రతిపక్ష హోదా లేకుండా బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేస్తామని సీఎం పదే పదే చెబుతున్నారు. రానున్న ఎన్నికల్లో తొంభై స్థానాలు గెలుచుకుని కాంగ్రెస్ పార్టీ తిరుగులేని అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల గడ్డపై నుంచి కేటీఆర్‌కు చెక్ పెట్టేందుకు అవసరమైన అన్ని రకాల గ్రౌండ్ వర్క్‌ను ఇప్పుడే పూర్తి చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఈ సభ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూడా భారీ జనసమీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నకిరేకల్ సభలో కేటీఆర్, హరీశ్‌రావులకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. దమ్ముంటే చర్చకు రావాలని ఓపెన్ ఛాలెంజ్ చేసి వారిని ఉలికిపాటుకు గురిచేశారు. ఇప్పుడు సిరిసిల్ల వేదికగా మరింత స్పష్టమైన ఆధారాలతో విరుచుకుపడేందుకు సిద్ధమయ్యారు. నిషేధిత జాబితాలోని భూములను అనుయాయులకు కట్టబెట్టిన వైనాన్ని ప్రజలకు పూసగుచ్చినట్లు వివరిస్తారు. ఇరవై రెండు ఏ చట్టాన్ని అడ్డుపెట్టుకుని జరిగిన భూదోపిడీ వివరాలను బట్టబయలు చేయనున్నారు. సిద్దిపేట, సిరిసిల్లలో దండయాత్ర చేస్తానని సీఎం ఇచ్చిన మాటను తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ఈ బహిరంగ సభ ద్వారా రాష్ట్ర రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేయాలని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తోంది. సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు అంకితభావంతో పనిచేస్తున్నాయి. రాబోయే రాజకీయ పరిణామాలు గులాబీ శిబిరంలో వణుకు పుట్టిస్తున్నాయి. ఈ నెల పదహారుతో అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ పర్యటన ఖరారు కానుంది. శాసనసభ సాక్షిగా దొరికిన అస్త్రాలను పట్టుకుని సీఎం ప్రజల్లోకి వెళ్తున్నారు. ప్రతిపక్షం ఎత్తులను తిప్పికొడుతూ అభివృద్ధి వికేంద్రీకరణను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రజాస్వామ్య పాలనలో ఎవరికీ ప్రత్యేక అధికారాలు ఉండవని నిరూపించడమే ఈ సభ ముఖ్య ఉద్దేశం. సిరిసిల్ల ప్రజలకు గత పదేళ్లలో జరిగిన మోసాన్ని అక్షరాల సహా వివరిస్తారు. కేసీఆర్ కుటుంబ పాలనను ప్రజలు ఎందుకు తరిమికొట్టారో ఈ సభ ద్వారా మరోసారి గుర్తు చేస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసే బాధ్యతను నేతలు భుజాన వేసుకున్నారు. ఈ నెల చివరి వారంలో జరిగే ఈ చారిత్రాత్మక సభ తెలంగాణ రాజకీయాల్లో పెద్ద ప్రకంపనలు సృష్టించడం ఖాయం. సీఎం రేవంత్ రెడ్డి వేస్తున్న ప్రతి అడుగు బీఆర్ఎస్ పార్టీని మానసికంగా కోలుకోలేని దెబ్బ తీస్తోంది. రానున్న కాలంలో గులాబీ పార్టీ పూర్తిగా కనుమరుగవుతుందని కాంగ్రెస్ నాయకులు బలంగా నమ్ముతున్నారు. ఈ సభతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం పూర్తిగా వేడెక్కనుంది.



# సాయుధ పోరాట యోధులకు ఘన నివాళి

- అమరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలి
- ఎంసీపీఐ(యు) నేత తుడుం అనిల్‌కుమార్


మియాపూర్, విశాల భారతి

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమరులైన యోధులకు ఎంసీపీఐ(యు) నాయకులు ఘన నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ వారోత్సవాల ప్రారంభ సభను ఆదివారం మియాపూర్ ఓంకార్‌నగర్‌లో నిర్వహించారు. ఎంసీపీఐ(యు) మియాపూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ డి.రంగస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎంసీపీఐ(యు) గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. నాటి సాయుధ రైతాంగ పోరాటం భూమి, భుక్తి, విముక్తితోపాటు ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం సాగిందన్నారు. ఈ పోరాటంలో సుమారు నాలుగు వేల మంది అమరులయ్యారని తెలిపారు. మూడు వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడి, పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచడం ద్వారా ప్రజల్లో చైతన్యం పెరిగిందన్నారు.సాధించుకున్న తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరలేదని విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజలకు వైద్యం, విద్య, కూడు, గూడు ఉచితంగా అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడటమే అమరులకు నిజమైన నివాళి అని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుకన్య, తాండ్ర కళావతి, కర్ర దానయ్య, డివిజన్ కార్యదర్శి ఇస్లావత్ దశరథ్‌నాయక్, నాయకులు జి.శివాని, బి.విమల, జి.లలిత, బి.అరుణ, ఇషాక్, అనిత, అన్నమ్మ పాల్గొన్నారు.

# భారతీయులున్న వాణిజ్య నౌకపై దాడి

మొదటిపేజీ తరువాయి

13 మందిని ఒమన్ అధికారులు రక్షించారు. ఒకరు గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నదని ఎంఈఏ తెలిపింది. అలాగే భారతీయులను రక్షించినందుకు ఒమన్ అధికారులకు కృతజతలు తెలిపింది. కాగా ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలు, నౌకా సిబ్బంది, పౌరులు, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదని భారతదేశం స్పష్టం చేసింది.





# ఓటు హక్కును కాపాడుకోవాలి

- గచ్చిబౌలి బీఆర్ఎస్ నేతలతో మాజీ కార్పొరేటర్ సాయిబాబా సమీక్ష

గచ్చిబౌలి-విశాల భారతి

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉమ్మడి గచ్చిబౌలి డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ బూత్ స్థాయి ఏజెంట్లు, ముఖ్య నాయకులతో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు కార్యక్రమంలో ఓట్లు కోల్పోయే పరిస్థితి ఉన్న వారికి అండగా నిలవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారికి అవగాహన కల్పించి, అవసరమైన గుర్తింపు పత్రాలతో సంబంధిత బీఎల్ఓలు, అధికారులను సంప్రదించేలా చూడాలని తెలిపారు. ఓటు ప్రతి పౌరుడి హక్కని, దానిని పరిరక్షించేందుకు నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సాయిబాబా సూచించారు.

# వినాయక నిమజ్జనానికి శేరిలింగంపల్లి సిద్ధం!

- భారీస్థాయిలో జోన్ యంత్రాంగం ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు

సైబరాబాద్ - విశాల భారతి



సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శేరిలింగంపల్లి జోన్‌లో వినాయక చవితి వేడుకలు, నిమజ్జన కార్యక్రమాలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకలు ప్రశాంత వాతావరణంలో, పర్యావరణహితంగా జరిగేలా నర్సింగి, పటాన్ చెరు, అమీన్ పూర్, మియాపూర్, శేరిలింగంపల్లి సర్కిళ్ల పరిధిలో జోన్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది.మట్టి గణపతుల వాడకాన్ని ప్రోత్సహించేందుకు అధికారుల ఆధ్వర్యంలో 10 వేల పర్యావరణహిత మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. భక్తుల సౌకర్యార్థం, నిమజ్జనం సజావుగా సాగేందుకు మొత్తం 30 ప్రాంతాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో 17 సహజ సిద్ధమైన చెరువులు, 8 బేబీ పాండ్స్, మరో 5 తాత్కాలిక కృత్రిమ కొలనులను సిద్ధం చేశారు. నిమజ్జన ప్రాంతాల వద్ద 70 మొబైల్ టాయిలెట్లను అందుబాటులో ఉంచడమే కాకుండా, పారిశుధ్య లోపం తలెత్తకుండా షిఫ్టుల వారీగా ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని మోహరించారు. అన్ని వార్డుల్లోనూ విద్యుత్ దీపాల ఏర్పాటు పనులను ఇప్పటికే పూర్తి చేశారు.

**రంగంలోకి 152 భారీ వాహనాలు, క్రేన్లు..**

నిమజ్జనం వేగవంతంగా పూర్తి చేసేందుకుగాను యంత్రాంగం ఏకంగా 152 భారీ వాహనాలను రంగంలోకి దించింది. విగ్రహాల పరిమాణానికి అనుగుణంగా 18 లాంగ్ బూమ్ క్రేన్లు (30 టన్నులు), 10 స్టాటిక్ క్రేన్లు (15 టన్నులు), 24 మొబైల్ క్రేన్లతో పాటు 39 టిప్పర్లు, 25 మినీ టిప్పర్లు, 19 లాంగ్ బూమ్ ఎక్స్‌కవేటర్లు, 27 జేసీబీలను అందుబాటులో ఉంచారు.

**అందుబాటులో తాగునీరు,కంట్రోల్... రూమ్‌లు..**

నిమజ్జన ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా అప్రోచ్ రోడ్ల మరమ్మతులు, పూడికతీత, రంగులు వేయడం, కొలనుల్లో శుభ్రమైన నీటిని నింపే పనులు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తూనే, నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. రవాణాకు ఆటంకం కలగకుండా రహదారులపై విద్యుత్ లైన్ల తొలగింపు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. వేడుకలు సురక్షితంగా, ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసేలా అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నట్లు శేరిలింగంపల్లి జోన్ అధికారులు వెల్లడించారు.



# గుడుంబా తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

**దేవరుప్పుల విశాల భారతి :** మండలం బంజర గ్రామంలో ఇంటి వద్ద అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో దేవరుప్పుల ఎస్సై సృజన్ కుమార్ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్య శాంతమ్మ ఇంటి వద్ద గుడుంబా తయారీకి ఏర్పాటు చేసిన సామగ్రిని ధ్వంసం చేశారు. సుమారు 15 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, మూడు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సృజన్ కుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో యాకూబ్ అశోక్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రంక్ డ్రైవ్‌లో 292 మందిపై కేసులు

- 240 ద్విచక్ర వాహనాలు.. 40 కార్లు.. 12 ఆటోలు

సైబరాబాద్ - విశాల భారతి



సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 292 మందిపై కేసులు నమోదయ్యాయి. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 240 మంది ద్విచక్ర వాహనదారులు, 12 మంది ఆటో డ్రైవర్లు, 40 మంది కార్ల డ్రైవర్లు పట్టుబడ్డారు. వీరిలో 248 మందికి 36 నుంచి 200 ఎంజీ, 30 మందికి 201 నుంచి 300 ఎంజీ, 14 మందికి 301 నుంచి 550 ఎంజీ వరకు రక్తంలో ఆల్కహాల్ ఉన్నట్లు గుర్తించారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ అధికారులు తెలిపారు.మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ ట్రాఫిక్ ఏడీసీపీ జి. నరేందర్ హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేసి, గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు.ఇదిలా ఉండగా సెప్టెంబర్ 7 నుంచి 12 వరకు 681 డ్రంక్ డ్రైవ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో 18 మందికి జరిమానా తోపాటు జైలు శిక్ష, ఏడుగురికి జరిమానాతోపాటు సామాజిక సేవ, 656 మందికి జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

# హైదర్ నగర్‌లో మట్టి గణపతుల పంపిణీ



- పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత
- మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

హైదర్ నగర్ - విశాల భారతి

వినాయక చవితి సందర్భంగా హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని సమతా నగర్, హైదర్ నగర్‌లో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీవాసులకు మట్టి గణపతులను అందజేశారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మట్టి గణపతుల వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని జరగదని, నిమజ్జన సమయంలో ఇంటి ఆవరణలోనే ఒక తొట్టిలో నిమజ్జనం చేసి ఆ మట్టిని పూలకుండీలకు వాడుకోవచ్చని సూచించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- చిన్నారులకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

శేరిలింగంపల్లి-విశాల భారతి

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బలరాం యాదవ్ పిలుపునిచ్చారు. కొండాపూర్ శ్రీరాంనగర్‌లో ఆయన ఆధ్వర్యంలో 'ఎకో ఫ్రెండ్లీ గణేష్' కార్యక్రమాన్ని నిర్వహించి చిన్నారులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బలరాం యాదవ్ మాట్లాడుతూ.. పూర్వం మట్టి వినాయకుడిని భక్తిశ్రద్ధలతో పూజించి నిమజ్జనం చేయడం ఆనవాయితీగా ఉండేదన్నారు. ప్రస్తుతం రసాయనాలతో తయారైన విగ్రహాల వినియోగం పెరగడంతో పర్యావరణానికి నష్టం కలుగుతోందని



పేర్కొన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మట్టి గణపతులనే పూజించాలని సూచించారు. అనంతరం తన సొంత ఖర్చులతో సేకరించిన మట్టి వినాయక విగ్రహాలను చిన్నారులకు అందజేశారు. శేరిలింగంపల్లి ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయ ఆర్చిపై భారీ వృక్షం

- భారీ వర్షా నికి కూలిన ఘటన
- మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తొలగింపు

హైదర్‌నగర్ - విశాల భారతి

భారీ వర్షానికి హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సెవెన్ హిల్స్‌లో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని భారీ వృక్షం నేలకొరిగి ఆలయ ప్రధాన ప్రవేశద్వారంపై పడింది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు, స్థానికులు కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.వృక్షం కూలిన విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. నగరపాలక అధికారులు, విపత్తు ప్రతిస్పందన సిబ్బందితో సమన్వయం చేసుకుని చెట్టును తొలగించే చర్యలు



చేపట్టారు. భారీగా విరిగిపడిన కొమ్మలు, చెట్టు మొదలును తొలగించేందుకు సిబ్బంది గంటల తరబడి శ్రమించారు. అనంతరం చెట్టును పూర్తిగా తొలగించి ఆలయ ప్రవేశ మార్గాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్పందించి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. స్థానిక శాసనసభ్యుడు అరెకపూడి గాంధీ సూచనల మేరకు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

# వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





- చౌటుప్పల్ చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్

**చౌటుప్పల్,విశాల భారతి:**

పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పురపాలక పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 12వ వార్డు గాంధీ పార్క్ వెనుక ఉన్న మూడు ఇళ్లలోకి వరద నీరు చేరిందని తెలుసుకున్న వెంటనే చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్ హుటాహుటిన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవితో కలిసి ఇళ్లలోకి చేరిన నీటిని తొలగించేందుకు మున్సిపల్ సిబ్బందికి తక్షణ ఆదేశాలు జారీ చేశారు. వరద పరిస్థితిని ఎదుర్కొనేందుకు అత్యవసరంగా రెండు జెసిబిలను అందుబాటులో ఉంచి, ఎక్కడ అవసరమైతే అక్కడ ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని కమిషనర్, అధికారులను ఆదేశించారు.

**పలు ప్రాంతాల్లో వరద నీటి తొలగింపు:**

**14వ వార్డు:** రూమి ఇంజనీరింగ్ వర్క్స్ షెడ్ వెనుక నిలిచిపోయిన వర్షపు నీటిని జెసిబి సహాయంతో సర్వీస్ రోడ్డులోని పెద్ద నాలాలోకి మళ్లించారు.

**తంగడపల్లి రోడ్డు:** నిలిచిన నీటిని తొలగించేందుకు నాగులకుంటలోకి చిన్న కాలువ తవ్వి నీటిని పంపించారు.

**హనుమాన్ నగర్:** లక్కారం నుంచి వచ్చే వరద నీటికి ప్రస్తుతం ఉన్న చిన్న మ్యాన్ హోల్ సరిపోదని గుర్తించి, భవిష్యత్తులో పైనుంచే వరద నీటిని మళ్లించేలా శాశ్వత ఏర్పాట్లు చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.

**వలిగొండ రోడ్డు:** కల్వర్టు వద్ద నిలిచిపోయిన వర్షపు నీటిని పక్కనే ఉన్న మోరీలోకి మళ్లించే ఏర్పాట్లు చేశారు.

**జయ భూమి వెంచర్:** పెద్ద డ్రైనేజీ నుంచి తాళ్లసింగారం చెరువు వరకు పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, నాయకులు ఉడుగు రమేష్, బత్తుల విప్లవ్, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, యస్ఐ హనుమాన్ ప్రసాద్, ఈఈ రేణు కుమార్, టీడబ్ల్యూఐ సంతోష్, జవాన్లు అంజయ్య, నరసింహ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# యాచారం టు మిర్ఖాన్పేట్ రోడ్డుకు మోక్షం ఎప్పుడు

- చినుకు పడితే రోడ్డు చిత్తడే.. ఇబ్బంది పడుతున్న వాహనదారులు ప్రజలు
- తక్షణమే రోడ్డు పనులు చేపట్టాలి

**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** నాగార్జునసాగర్ ప్రధాన రహదారులను కలిపే కీలకమైన యాచారం మీర్ఖాన్‌పేట్ (కందుకూరు) రహదారి నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా అడుగు ముందుకు పడకపోవడంపై స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2019లో అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు రూ. 84.50 కోట్ల నిధులతో ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన చేసినప్పటికీ, నేటికీ ఆ పనులకు మోక్షం లభించలేదు. విస్తరణ పేరుతో అప్పటివరకు బాగున్న 15 ఫీట్ల రోడ్డును సైతం తవ్వేసి మట్టి నేలగా మార్చడంతో, ప్రస్తుతం కంకర తేలి బాటసారులకు నరకయాతన చూపిస్తోంది. ఇటీవలి వర్షాలకు రోడ్డంతా గుంతలు, బురదమయంగా మారడంతో యాచారం, నంది వనపర్తి వైపు వెళ్లే విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ప్రాణాలు చేతబట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు, పక్కనే ఉన్న ఫార్మాసిటీ, మేడిపల్లి రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతుంటే, నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ ప్రధాన రహదారిని పక్కనబెట్టడంపై తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. టీజీ ఐఐసీ , ఆర్ &బి శాఖల మధ్య సమన్వయ లోపం వల్లనే ఈ పనులు "ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్టుగా మారాయని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి కనీసం గుంతలైనా పూడ్చి తాత్కాలిక సౌకర్యం కల్పించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు

# సీఐ మహేందర్ రెడ్డిని సన్మానించిన గున్న రాజేందర్ రెడ్డి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ సివిల్ ఫోర్స్ పోలీస్ ఆఫీసర్స్ సెక్రటరీగా ఎన్నికైన సందర్భంగా ఇబ్రహీంపట్నం సిఐ మహేందర్ రెడ్డిని ని ఘనంగా సన్మానించిన భూదాన్ బోర్డు చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, ఆయన తోపాటు చెరుకూరి రాజు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను చేపట్టాలని ఆయన సేవలను కొనియాడారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తాం

- బీసీ సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్ మేకల శ్రీనివాస్ యాదవ్



**ముషీరాబాద్,విశాల భారతి:** చట్టసభల్లో 50% బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మేకల శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం విద్యానగర్ బీసీ భవన్ లో ఆర్ కృష్ణయ్య జన్మదినం సందర్భంగా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ నేతృతంలో మేకల శ్రీనివాస్ యాదవ్ ఆర్ కృష్ణయ్యను కలసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఎస్సీ ఎస్టీ బీసీ అణగారిన వర్గాల కోసం ఆర్ కృష్ణయ్య నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ఆయన పోరాటం ఫలితంగానే అణగారిన వర్గాల్లో చైతన్యం వచ్చిందని పేద కుటుంబాల్లో విద్య ఉద్యోగ ఉపాధి కలిగిందని తెలిపారు. ఇక ముందు కూడా బీసీ వర్గాల కోసం హాస్టల్స్ గురుకుల పాఠశాలలు స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ కోసం ఆర్ కృష్ణయ్య నేతృతంలో పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందికొండ రమేష్, అరుణ్, వినయ్ కుమార్, ఎం శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నామాల గుండు గణేష్ సమితి నూతన కమిటీ ఎన్నిక



**సికింద్రాబాద్, విశాల భారతి :** గణేష్ ఉత్సవ సమితి నామాలగుండు నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 31 వ సంవత్సరం స్వాగత వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 25న గణేష్ నిమజ్జనం రోజున నామాల గుండు చౌరస్తాలో గణేష్ విగ్రహాల స్వాగత వేదిక ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రసాద వితరణ చేపడుతున్నట్లు చెప్పారు. నూతన కమిటీ సభ్యులు అధ్యక్షుడిగా అశోక్ కుమార్, ఉపాధ్యక్షులుగా మహంకాళి సురేష్ చారి, మధు సూదన్ రెడ్డి, కోశాధికారులుగా విజయ్,వెంకటేశులు, ప్రధాన కార్యదర్శులుగా ఆర్టిసి వెంకటేష్, కామేష్, ఆర్టీసీ రామారావు తదితరులను ఎన్నుకున్నారు.

# మహనీయుడి సేవలకు గ్రామం ఘన నివాళి

- రంగదాసు పంతులు విగ్రహ ఏర్పాటుకు బండరావిరాల ఏకగ్రీవ నిర్ణయం
- విద్య, వైద్యం, సామాజిక చైతన్యానికి ఆయన సేవలు చిరస్మరణీయం
- గ్రామ సభ, పంచాయతీ తీర్మానంతో విగ్రహ ఏర్పాటుకు చర్యలు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**




బండరావిరాల గ్రామానికి విద్య, వైద్యం, కళలు, సామాజిక చైతన్యం అందించిన కీ.శే. గుండోజి రంగదాసు (పంతులు) సేవలను స్మరించుకుంటూ ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్, పాలకవర్గం, గుండోజి రంగదాసు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రంగదాసు పంతులు బండరావిరాల గ్రామానికి తొలి గురువుగా విద్యాబోధన చేయడంతో పాటు పేదలు, అభాగ్యులకు వైద్య సేవలు అందించారని గ్రామస్తులు గుర్తుచేశారు. భూపోరాటంలో కీలకపాత్ర పోషించి గ్రామ ప్రజల భూముల పరిరక్షణకు పోరాడారని, వీధి నాటకాలు, భాగోతాలు నేర్పించి ప్రజల్లో సామాజిక చైతన్యం పెంపొందించారని పేర్కొన్నారు. గ్రామ శ్రేయస్సు కోసం తన సొంత ఇంటినే పాఠశాలగా మార్చి విద్యాబోధన చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన వద్ద విద్య, కళలు నేర్చుకున్న పలువురు శిష్యులు ఈ సందర్భంగా తమ గురువును స్మరించుకుంటూ భావోద్వేగంతో నివాళులర్పించారు. రంగదాసు పంతులు సేవలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు ఆయన జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నిర్ణయించారు. గ్రామ సభ, పంచాయతీ తీర్మానం మేరకు గ్రామ ప్రజల సహకారంతో విగ్రహ ఏర్పాటు ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్, పాలకవర్గ సభ్యులు తెలిపారు. మహనీయుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, గ్రామ ఐక్యతను కాపాడుకుంటూ అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు కన్నె భరత్ యాదవ్, ఏర్పుల హరికృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్, గుండ్ల భవానీ-శివ ముదిరాజ్, గ్రామ పెద్దలు కందికంటి బిక్షపతి, నెమురగోముల యాదయ్య, నెమురగోముల కరుణ్, వల్లపు కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# నియోపోలిస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- 17 ఏళ్ల విద్యార్థి మృతి.. కారులో ఎనిమిది మంది మైనర్లు ఉన్నట్లు పోలీసుల వెల్లడి

**రాజేంద్రనగర్, విశాల భారతి :**



నియోపోలిస్ ప్రాంతంలో తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 17 ఏళ్ల విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి తల్లి సెప్టెంబర్ 13న ఉదయం సుమారు 6 గంటలకు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తన కుమారుడు సెప్టెంబర్ 12న మధ్యాహ్నం కూకట్‌పల్లిలోని తన స్నేహితుడి ఇంట్లో నిర్వహించిన పుట్టినరోజు వేడుకకు వెళ్లినట్లు తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 13న తెల్లవారుజామున సుమారు 3:30 గంటల సమయంలో టీఎస్06ఎఫ్ఈ4545 నంబర్ గల కారు నియోపోలిస్ జంక్షన్ నుంచి కోకాపేటలోని లేక్‌వ్యూ పాయింట్ వైపు వెళ్తుండగా నియోపోలిస్ వ్యూపాయింట్ సమీపంలో ప్రమాదానికి గురైనట్లు సమాచారం అందిందని పేర్కొన్నారు. ప్రమాదంలో తన కుమారుడు మృతి చెందినట్లు సమాచారం అందినప్పటికీ, ప్రమాదం ఏ విధంగా జరిగింది, ప్రమాదానికి దారితీసిన ఖచ్చితమైన పరిస్థితులు ఏమిటనే విషయంపై తనకు పూర్తి సమాచారం లేదని మృతుడి తల్లి ఫిర్యాదులో తెలిపారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించేందుకు సంఘటనా స్థల పరిశీలన, ప్రమాదానికి గురైన కారు పరిస్థితి, అందుబాటులో ఉన్న సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. కారులో మొత్తం ఎనిమిది మంది మైనర్ విద్యార్థులు ప్రయాణిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. అలాగే మృతుడు మద్యం సేవించి కారు నడిపినట్లు సమాచారం లభించిందని పేర్కొన్నారు. అయితే ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, ఇతర అంశాలు పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు తల్లిదండ్రులకు కీలక విజ్ఞప్తి చేశారు. మైనర్ పిల్లలకు వాహనాలు నడిపేందుకు ఇవ్వవద్దని సూచించారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. వాహనంలో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటుబెల్ట్ ధరించాలని, రహదారి భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.

# మహిళలకు కుట్టు శిక్షణ.. సర్టిఫికెట్ల పంపిణీ

**పాల్వంచ విశాల భారతి సెప్టెంబర్ 13:**



42వ డివిజన్‌లో మదర్ థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత రెండు నెలలుగా మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ అందించారు. మహిళలు స్వయం ఉపాధి పొందుతూ తమ కాళ్లపై తాము నిలబడేలా ఫౌండేషన్ సంధ్యారెడ్డి కృషి చేశారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన మహిళలకు డీసీసీ తోట దేవి ప్రసన్న, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, 5వ డివిజన్ కార్పొరేటర్ సరిత, యూత్ కాంగ్రెస్ నాయకుడు చీకటి కార్తీక్ తదితరుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమం 42వ డివిజన్ కార్పొరేటర్ దున్న పోతుల మణి, రవి ఆధ్వర్యంలో జరిగింది. శిక్షణను సద్వినియోగం చేసుకున్న మహిళలకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకుడినే పూజిద్దాం

- చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ పావని రమేష్ గౌడ్
- డాక్టర్ అవ్వారి శ్రీనివాస్ ప్రసాద్ సుధా పిల్లల హాస్పిటల్



**చౌటుప్పల్,విశాల భారతి:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మట్టి వినాయకుడినే పూజించాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవా ఆధ్వర్యంలో, చౌటుప్పల్ సుధా పిల్లల ఆసుపత్రి డాక్టర్ అవ్వారు శ్రీనివాస్ ప్రసాద్ సౌజన్యంతో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ పావని రమేష్ గౌడ్ తన చేతుల మీదుగా ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల చెరువులు, నీటి వనరులు తీవ్రంగా కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని, ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మట్టి విగ్రహాలనే పూజించాలని కోరారు. "మట్టి వినాయక విగ్రహాలను పూజించండి పర్యావరణాన్ని పరిరక్షించండి" అనే సందేశంతో గత పదేళ్లుగా లయన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవా ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వందలాది మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఉప్పు ఆంజనేయులు, అధ్యక్షులు ఎండి అతహర్ పాషా, ట్రెజరర్ బత్తిని రఘు, గోశిక కరుణాకర్, కాసుల వెంకటేశం, కొసనం రామ్ రెడ్డి, పోలోజు శ్రీనివాస చారి, కటకం ప్రశాంత్, కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, చిలువేరు మంగయ్య, వనం రాజు, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, అయ్యాడపు ప్రతాప్ రెడ్డి, సురోజు సత్యనారాయణ చారి తదితరులు పాల్గొన్నారు.

# యజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 108 మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



**చౌటుప్పల్,విశాల భారతి:** పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా యజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండల కేంద్రంలోని రామాలయ ప్రాంగణంలో ఆదివారం 108 మట్టి గణపతి ప్రతిమలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యజ్ఞ ఫౌండేషన్ అధ్యక్షురాలు నల్ల భూమిక మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం మట్టి విగ్రహాలకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుండటం సంతోషకరమన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించి, సహజసిద్ధమైన మట్టి గణపతి ప్రతిమలను వినియోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. గణపతి నవరాత్రుల సందర్భంగా భక్తులు మట్టి విగ్రహాలతో పూజలు నిర్వహించి, పర్యావరణహితమైన పండుగను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు యాట మహేందర్, బడుగు హరినాథ్, నల్ల ఉదయ్ కిరణ్, రాపోలు ఉదయ్ శంకర్, పోలేపల్లి మహేష్, బొబ్బిల్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడిని అందిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

- ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ సభ్యులు



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఆదివారం ఎన్ఎన్ఆర్ వ్యవస్థాపకులు నాయిని నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో యాచారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎస్ఐలకు మట్టి వినాయక విగ్రహాలను ఎన్ ఎన్ ఆర్ సభ్యులు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు, సిఐ ఎస్ఐలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ప్రోత్సహిస్తూ, ప్రకృతిని కాపాడే బాధ్యత మనందరిదని అన్నారు. మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించడం పాటు సంస్కృతి సంప్రదాయం కూడా పరిరక్షించుకోవచ్చని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించండి: ఏసిపి రణవీర్ రెడ్డి



**ముషీరాబాద్,విశాల భారతి:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చిక్కడపల్లి ఏసీపీ రణవీర్ రెడ్డి అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలో వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రంగు రంగుల వినాయక విగ్రహాలతో పర్యావరణ ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నైషదం సత్యనారాయణమూర్తి చిక్కడపల్లి సీఐ మధుబాబు, ఎస్ ఐలు శివప్రసాద్, కరీమ్, సీతారామ్ రెడ్డి, కాశిం, సాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


# కట్ట సత్యనారాయణ చారి మృతి విశ్వబ్రాహ్మణ జాతికి తీరని లోటు

- బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి..

**ముషీరాబాద్,విశాల భారతి:** కట్ట సత్యనారాయణ చారి మృతి విశ్వబ్రాహ్మణ జాతికి తీరని లోటు అని బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి అన్నారు. విశ్వబ్రాహ్మణ జాతి ఐక్యత కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆదివారం జరిగిన కట్ట సత్యనారాయణ సంతాప సభకు శాసనమండలి ఫ్లోర్ లీడర్ మధుసూదనాచారి, కుందారం గణేష్ చారి, లాల్ కోట వెంకటాచారి, రంగాచారి, దుబ్బాక కిషన్ రావు, మారోజు వినోద్ కుమార్, సుదర్శన చారి, రాఘవాచారి, బ్రహ్మాచారి, వల్లబోజు నరసింహ చారి హాజరై సత్యనారాయణ చారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుందారం గణేష్ చారి మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయంలో కట్ట సత్యనారాయణ చారి తో కలిసి ఎన్నో పోరాటాలు చేసి విశ్వబ్రాహ్మణులకు ఉపయోగపడే విధంగా ఎన్నో జీవోలు తీసుకు వచ్చామని గుర్తు చేశారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘానికి సత్యనారాయణ చారి ఎనలేని సేవలను అందించారని ఇలాంటి మహనీయుని కోల్పోవడం జాతికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో వినాయక మండపం ప్రారంభం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్ మండలం పిగ్లిపూర్ గ్రామంలోని సాయి నగర్ టౌన్‌షిప్‌లో నూతనంగా నిర్మించిన వినాయక మండపాన్ని భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. పిగ్లిపూర్ సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి తల్లి కోట నిర్మలమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త కోట రామిరెడ్డి, కుమారుడు ప్రభాకర్‌రెడ్డి-సుజాత దంపతులు, మనుమలు నికిత, రితీష్‌రెడ్డి, సాయితేజరెడ్డి కుటుంబ సభ్యుల సొంత నిధులతో ఈ మండపాన్ని నిర్మించారు. మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దుర్గం నరసింహ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడికి భక్తులు పూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు. కుటుంబ సభ్యులు తమ తల్లి, అమ్మమ్మ జ్ఞాపకార్థం మండపాన్ని నిర్మించడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జక్కుల శివకుమార్, జక్కుల ఝాన్సీ-ఆంజనేయులు, వర్ధన్ లావణ్య-హనుమంతు, జక్కుల పరమేష్, పంది మురళీకృష్ణ, కొండ రమేష్, కొలను హరిణి-మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పిగ్లిపూర్ గ్రామ పెద్దలు, చిన్నారులు, మహిళలు, యువతతో పాటు సాయి నగర్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయక మండపం ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

# మట్టి గణపతులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**రాజేంద్రనగర్, విశాల భారతి :** మైలార్‌దేవ్‌పల్లి ప్రకృతిని పూజించడం సనాతన ధర్మంలో భాగమని, పంచభూతాల్లో ఒకటైన భూమి నుంచి లభించే మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గం పోటీ చేసిన అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ కార్యాలయం వద్ద ఆదివారం మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల్లో కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. ముక్కోటి దేవతల్లో తొలి పూజ అందుకునే గణనాథుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించాలని, అదే సమయంలో ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టితో చేసిన వినాయక ప్రతిమలను వినియోగించాలని కోరారు. భక్తి, సంప్రదాయంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు ఆడికే జనార్దన్, శ్రీకాంత్ రెడ్డి, సంతు గౌడ్, రామారావు, ప్రభుదాస్, రమేష్ రెడ్డి, సురేష్, రాంబాబు, శేఖర్, మహమ్మద్, శంకర్ రెడ్డి, మాణిక్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన చిలుక మధుసూదన్ రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఉప్పల్ బగాయత్‌లో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనం భూమిపూజ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి సంబంధించిన విషయాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# పర్యావరణ హితమే లక్ష్యంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**



**సికింద్రాబాద్, విశాల భారతి :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో బౌద్ధనగర్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపిణీ చేశారు. మట్టితో, ఎలాంటి రసాయన రంగులు లేకుండా తయారుచేసిన వందలాది విగ్రహాలను స్వరూప గౌడ్ ప్రజలకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.... ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల చెరువులు తీవ్రంగా కలుషితం అవుతున్నాయి అని,ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్ గౌడ్, అగుల్ల శ్రీనివాస్, నవీన్, జయంత్, విష్ణు,రూప్ సాయి, రోహిత్,స్వప్న, ప్రకాష్ తదితర బస్తీ వాసులు పాల్గొన్నారు.

# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**సికింద్రాబాద్, విశాల భారతి :** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ సందీప్ కిరణ్ కప్పెర ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.ఎస్. భాస్కర్ గిరి ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా మరియు ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు రవి ప్రసాద్ గౌడ్ , సురేష్ ముదిరాజ్ , అజయ్ నాయుడు , జ్ఞానేశ్వర్ , కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ హిత వినాయకుడినే పూజిద్దాం

**పాల్వంచ విశాల భారతి, సెప్టెంబర్ 13:** పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో గ్రీన్ ఎర్త్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణహిత కార్యక్రమం నిర్వహించారు. భజన మందిరం రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలతో పాటు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ ఎర్త్ సొసైటీ ప్రతినిధి రమేష్ రాథోడ్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "మట్టి విగ్రహాల వైపే అడుగు వేయాలి.. పర్యావరణ అనుకూల ప్రతిమలతోనే వినాయకుడిని పూజించి ప్రకృతిని కాపాడుకుందాం" అని పిలుపునిచ్చారు. సొసైటీ అధ్యక్షుడు బాలినేని సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా 2012 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు, మొక్కలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పాల్వంచ ప్రాంతంలో పరిశ్రమల కారణంగా కాలుష్యం అధికంగా ఉన్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు.

# నిజాం ప్రభుత్వాన్ని కూల్చిన ఘనత కమ్యూనిస్టులదే

- **నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి**
- **సాయుధ పోరాటంలో ఇసుక రేణువంత పాత్ర కూడా బిజెపికి లేదు**
- **పదిలక్షల ఎకరాల భూమిని పేదలకు పంచింది కమ్యూనిస్టులే**
- **రాష్ట్ర ప్రభుత్వం విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి:సీపీఐ జిల్లా కార్యదర్శి SK సాబీర్ పాషా**
- **సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు సభ**



**పాల్వంచ విశాల భారతి:**

నాటి దొరలు, దేశముఖ్ లు, రజాకారుల మూకలను తరిమికొట్టి తెలంగాణకు విముక్తి కలిగించింది కమ్యూనిస్టులేనని, అదే స్పూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న నేటి పాలకులను తరిమికొట్టాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి SK సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ ఎదుట అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వార్షికోత్సవ సభ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ పాత్ర ఎంతో ఉందని, భూమి కోసం, భుక్తి కోసం, అణగారిన వర్గాల కోసం ముఖ్యంగా రైతుల సమస్యల గురించి, రజాకారుల రాజకీయ పాలనను అంతమొందించడంలో సిపిఐ కీలకపాత్ర పోషించిందన్నారు. 1947 సెప్టెంబర్ 11న అమరవీరులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మోహియుద్దీన్ పిలుపుతో మహోద్యమం ప్రారంభం అయ్యిందని, వారి నాయకత్వంలో సాగిన సాయుధ పోరాటం వందల ఏండ్ల చరిత్ర ఉన్న నిజాం రాజును గద్దె దింపిందని, నిజాం స్వాదీనంలో ఉన్న తెలంగాణా భూ భాగాన్ని భారతదేశంలో అంతర్భాగం చేసిందన్నారు. అదే ప్రమాదకర పరిస్థితులు ప్రస్తుతం దేశంలో నెలకొన్నాయన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఇసుక రేణువంత పాత్ర కూడా బిజెపికి లేదని, ఈ పోరాటాన్ని తామే చేసినట్లుగా చెప్పుకోవడం, ఉత్సవాలకు సిద్ధం కావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదిలక్షల ఎకరాల భూమిని ఈ పేదలకు పంచిన ఘనత సిపిఐ కే దక్కుతుందని తెలిపారు. గత పది ఏళ్లగా నియంతలాగా వ్యవహరించిన గత ప్రభుత్వం విలీన దినోత్సవం అధికారికంగా నిర్వహించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అయిన విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. అనంతరం ఈ సేవ సెంటర్ వద్ద సాయుధ పోరాట యోధులు ఉషారావు, రామకోటయ్యల స్థూపం, అమరవీరులు సిద్ధి వెంకటేశ్వర్లు, ఉప్పుశెట్టి ఖాదర్ బాబు, దేవభక్తిని రమేష్, చంద్రశేఖర్, పాశం శ్రీనివాస్ స్మారక స్థూపాలు వద్ద పుల్లమలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు డి సుధాకర్, వి పద్మజ, నిమ్మల రాంబాబు, సర్పంచులు బాబురావు, రమేష్, నాయకులు SA రెహమాన్, ఉప్పుశెట్టి సునీల్ కుమార్, చెరుకూరి శేఖర్ బాబు, ys గిరి, గౌస్ పాషా, అహ్మద్ జానీ, మస్తాన్, వలపు యాకయ్య, ఇరుకులపాటి సుధాకర్, కొంగర అప్పారావు, జకరయ్య, కరీం, కిరణ్, రమేష్, వెంకన్న, అమీర్, చందూలాల్, ఆదినారాయణ, బోడా భీమా, ప్రేమచంద్, వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవి, సాయిలు శ్రీను, సాయిలి వెంకన్న, భూక్యా రమేష్, గరిగ రమేష్, భరత్, గూగులోత్ భద్రు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరి

- **నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: రాయదుర్గం సీఐ భూపతి**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

మణికొండ వినాయక చవితి ఉత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో గణేష్ మండపాల నిర్వాహకులతో రాయదుర్గం పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మణికొండ మర్రిచెట్టు కమ్యూనిటీ హాల్‌లో రాయదుర్గం సీఐ భూపతి, ఎస్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉత్సవాల సందర్భంగా పాటించాల్సిన భద్రతా చర్యలు, పోలీసు నిబంధనలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ భూపతి మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద విద్యుత్ సౌకర్యం, అగ్నిప్రమాదాల నివారణ, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని సీఐ స్పష్టం చేశారు. అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని, ప్రభుత్వం, పోలీసుల నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయాల్లోనే శబ్ద వ్యవస్థలను వినియోగించాలని హెచ్చరించారు. మండపాల వద్ద భక్తులు, స్థానిక ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసుకోవడంతో పాటు రాత్రి వేళల్లో ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా, ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా పోలీసు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని సీఐ భూపతి కోరారు. నిబంధనలను పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో మణికొండ ప్రాంతానికి చెందిన నాయకులు, గణేష్ మండపాల నిర్వాహకులు, రాయదుర్గం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోరాట చరిత్రను వక్రీకరించొద్దు




- **నిజాం మెడలు వంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి 78 ఏళ్లు**
- **బీజేపీ, ఆర్ఎస్ఎస్ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి : ముత్యాల యాదిరెడ్డి**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణలో సాగిన రైతాంగ సాయుధ పోరాటానికి 78 ఏళ్లు పూర్తయ్యాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. వెట్టి చాకిరి విముక్తి, భూమి కోసం, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం సాగిన ఈ పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఆర్కే నగర్‌లో కార్యక్రమం నిర్వహించారు. శాఖ సహాయ కార్యదర్శి పేరాల గోపి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముత్యాల యాదిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాది రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది తర్వాత తెలంగాణ ప్రాంతానికి రైతాంగ పోరాటం ద్వారా విముక్తి లభించిందన్నారు. నిజాం పాలనలో వెట్టి చాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం సాగిందన్నారు. దున్నేవాడికే భూమి దక్కాలనే నినాదంతో సాగిన ఉద్యమం ద్వారా సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను కనుమరుగు చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు ప్రయత్నిస్తున్నాయని ముత్యాల యాదిరెడ్డి విమర్శించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ వల్లే తెలంగాణకు విముక్తి లభించిందనే తప్పుడు చరిత్రను ప్రచారం చేస్తూ కమ్యూనిస్టులు, రైతులు చేసిన త్యాగాలను మరుగునపరచాలని చూస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ పల్లెల్లో రక్తం చిందించిన అమరుల త్యాగాలను విస్మరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ పోలో పేరుతో తెలంగాణలోకి వచ్చిన పటేల్ సైన్యం నిజాం నవాబును జైలులో పెట్టకుండా రాజ్ ప్రముఖ్ బిరుదు ఇవ్వడం దారుణమని ఆయన అన్నారు. రైతాంగ పోరాటం సాధించిన ఫలితాలను, ప్రజల త్యాగాలను చరిత్ర నుంచి చెరిపివేయడం ఎవరి వల్లా సాధ్యం కాదన్నారు.అదే పోరాట స్ఫూర్తితో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కూడా ముందుకు సాగిందని గుర్తుచేసిన ఆయన.. సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహా, బీఓసీ జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, మండల కార్యవర్గ సభ్యుడు పొన్నాల యాదగిరి, ఆర్కే నగర్ శాఖ సభ్యులు కారంపోడి నర్సింహా, మిడతపల్లి ఉప్పలయ్య, కనకయ్య, మల్లేష్, నర్సింహా, యాదగిరి, శైలజ, శోభన్, రామ, అడిమయ్య, గంగ, ఎల్లేష్, రమేష్, లింగమ్మ, రేణుక, నర్సమ్మ, అంజమ్మ, శ్రీను, కళ్యాణి తదితరులతో పాటు ప్రజా నాట్య మండలి కళాకారులు పాల్గొన్నారు.

# వీరుల త్యాగాలకు వందనం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా తెలంగాణ విమోచన కోసం పోరాడి అమరులైన వీర సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న మిలిటరీ ట్యాంక్ వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లి అమరవీరులకు పుష్పాంజలి ఘటించారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన సైనికుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. వారి ధైర్యం, దేశభక్తి, త్యాగ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు.

**అధికారికంగా నిర్వహించాలి**

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన కోసం తమ జీవితాలను, ప్రాణాలను అర్పించిన వీరుల త్యాగాలను ప్రభుత్వం అధికారికంగా స్మరించుకోవాలని కోరారు. విమోచన చరిత్రను భావితరాలకు తెలియజేసేలా ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, తెలంగాణ విమోచన దినోత్సవ కమిటీ చైర్మన్ బూర నర్సయ్యగౌడ్, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పాల్గొని అమరవీరులకు పుష్పాంజలి ఘటించారు. అలాగే హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోవిందాచారి, నాయకుడు అరుణ్, బీజేవైఎం సీనియర్ నాయకుడు ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు 123లో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- **ఏసీఎఫ్ చొరవతో నిలిచిపోయిన భూగర్భ మురుగునీటి పనులకు మోక్షం**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** జీహెచ్ఎంసీ వార్డు నంబర్ 123 పరిధిలోని ఫీల్‌గుడ్ హోమ్స్ కాలనీ, పక్కనే నిర్మిస్తున్న నూతన కాలనీ మధ్య భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ అనుసంధానానికి సంబంధించి నెలకొన్న వివాదానికి పరిష్కారం లభించింది. దీంతో గత కొంతకాలంగా నిలిచిపోయిన మురుగునీటి పారుదల పనులు తిరిగి ప్రారంభమై పూర్తికావడంతో ప్రధాన రహదారిపై మురుగునీరు పొంగిపొర్లుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. భూగర్భ మురుగునీటి పైపులైన్ అనుసంధానంపై ఏర్పడిన సమస్య కారణంగా గత కొన్ని నెలలుగా మురుగునీరు ప్రధాన రహదారిపైకి చేరి ప్రవహించేది. దీంతో ఫీల్‌గుడ్ హోమ్స్ కాలనీ వాసులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారిపై మురుగునీరు నిలిచిపోవడంతో పాదచారులు, వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పాటు దుర్వాసనతో స్థానికులు అవస్థలు పడ్డారు. ఈ సమస్యపై స్పందించిన ఏసీఎఫ్ జీహెచ్ఎంసీ 121, 122, 123 డివిజన్ల ప్రతినిధులు సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు, ఫీల్‌గుడ్ హోమ్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు శాఖ అధికారులతో పలుమార్లు చర్చలు నిర్వహించారు. ఉమ్మడి సమావేశాల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అన్ని వర్గాలతో చర్చించి, పరస్పర అంగీకారంతో వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించారు. దీంతో నిలిచిపోయిన భూగర్భ మురుగునీటి పారుదల పైపులైన్ పనులను తిరిగి ప్రారంభించి పూర్తి చేశారు. పనులు పూర్తవడంతో ప్రధాన రహదారిపై మురుగునీటి ప్రవాహం నిలిచిపోయి స్థానికులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందుల నుంచి ఉపశమనం లభించింది. ఈ రహదారి సాయి బాలాజీనగర్, యాదయ్యనగర్, హిమగిరినగర్, కేకే నగర్ 1, శ్రీనివాసనగర్, బైరాగిగూడ తదితర ప్రాంతాలకు కీలకమైన అనుసంధాన మార్గంగా ఉంది. మురుగునీటి సమస్య పరిష్కారం కావడంతో ఆయా కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఏసీఎఫ్ ప్రతినిధులు ఫీల్‌గుడ్ హోమ్స్ కాలనీ వాసులు, జీహెచ్ఎంసీ డీఈఈ యాదయ్యతో పాటు సంబంధిత అధికారులు, పోలీసు శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంలో కృషి చేసిన ఏసీఎఫ్ అధ్యక్షుడు పి. వినయ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నదీమ్, ప్రధాన కార్యదర్శి నరేందర్ బాబు, కార్యవర్గ సభ్యులు హరీష్ గౌడ్, విజయ్ పద్మనాభం, జీహెచ్ఎంసీ డీఈఈ యాదయ్య తదితరులకు కాలనీవాసులు, ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రెండోసారి ఎన్.ఎస్.యు.ఐ. జిల్లా అధ్యక్షుడిగా అజ్మీర సురేష్ నాయక్



**కొత్తగూడెం విశాల భారతి, సెప్టెంబర్ 13:** ఎన్.ఎస్.యు.ఐ. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన అజ్మీర సురేష్ నాయక్‌ను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం అజ్మీర సురేష్ నాయక్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నూతన బాధ్యతల్లో మరింత సమర్థవంతంగా పనిచేసి ఎన్.ఎస్.యు.ఐ.కి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అజ్మీర సురేష్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలు, ఎన్.ఎస్.యు.ఐ. రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండే హనుమంతురావు, యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబీత్, నాయకులు బానోత్ శ్రీధర్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.



# జయమ్మ క్యారెక్టర్ షూటింగ్ పూర్తి

అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ హీరోగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'రణబాలి' చిత్రంలో రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆమె 'జయమ్మ' అనే కీలకమైన పాత్రను పోషిస్తున్నది. తాజాగా ఆమె పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా ఆమెకు వీడ్కోలు తెలుపుతూ చిత్రబృందం భావోద్వేగానికి లోనయ్యారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చారిత్రాత్మక పాన్ ఇండియా చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా 'రణబాలి' విడుదల కానున్నది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.